
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
బుధవారం 24 జనవరి 2024

ఎస్‌ఐల బదిలీలు

వికారాబాద్, జనవరి 23: వికారాబాద్ జిల్లాలో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తాండూరు ఎస్‌ఐగా ఉన్న ఎండీ రాహూఫ్ బొంరాస్‌పేట ఎస్‌ఐగా బదిలీకాగా, బొంరాస్‌పేట ఎస్‌ఐ పి.శంకర్ తాండూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అదే విధంగా వేయింటింగ్ లిస్టులో ఉన్న శ్రీశైలంయాదవ్‌ను దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా బాధ్యతలు అప్పగించగా, దౌల్తాబాద్ ఎస్‌ఐ వి.రమేష్‌నువికారాబాద్‌కు బదిలీ చేశారు.



- స్వచ్ఛమైన తేనె ఉత్పత్తిపై ఔత్సాహికుల దృష్టి
- రైతులకు అదనపు ఆదాయాన్నిస్తున్న తేనెటీగల పెంపకం
- ఓ వైపు జీవ వైవిధ్యం, మరో వైపు పంటలకు ప్రాణం
- ఆదర్శంగా నిలుస్తున్న పెంపకందారులు

తేనెపట్టు.. డబ్బు మస్తు!

వేలల్లో పెట్టుబడి.. లక్షల్లో ఆదాయం

ఔత్సాహికులు కొందరు తేనెటీగల పెంపకాన్ని చేపడుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలవడంతో పాటు వినియోగదారులకు స్వచ్ఛమైన తేనె అందజేస్తున్నారు. ప్రత్యేకంగా తేనెటీగలతో కూడిన బాక్స్‌లను కొనితెచ్చి ఉద్యానపంట క్షేత్రాల వద్ద అమరుస్తూ ఉపాధి పొందుతున్నారు. మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. తేనెటీగల పెంపకంతో ఓవైపు జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతూనే పంటలకు ప్రాణం పోస్తూ.. ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ 'బీ కీపింగ్ (తేనెటీగల పెంపకం) పెంపకందారులు, రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది.



వికారాబాద్(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి) జనవరి23 : ఒకప్పుడు అడవుల్లో, భారీ చెట్లకు మాత్రమే దొరికే తేనె ఇప్పుడు వ్యవసాయ అనుబంధరంగ పరిశ్రమగా మారింది. కొన్నేళ్ల కిందటి వరకు ఆంధ్ర, ఇతర ప్రాంతాలకే పరిమితమైన తేనెపట్టుల పెంపకం ఇప్పుడు తెలంగాణలోనూ క్రమంగా విస్తరిస్తోంది. స్వచ్ఛమైన తేనెకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటం, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుండడంతో ఈ 'బీకీపింగ్(తేనెటీగల పెంపకం) రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఒక్కసారి పెట్టుబడిపెట్టి అనువైన స్థలంలో మొదలుపెడితే క్రమం తప్పక ఆదాయం రావడం ఈ పెంపకం ప్రత్యేకత. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలువురు రైతులు మధురమైన తేనె ఉత్పత్తికి మక్కువ చూపుతున్నారు. తేనెటీగల పెంపకంపై ఇప్పుడిప్పుడే రైతులు ఆసక్తి చూపుతూ రాణిస్తున్నారు. తేనెటీగలతో కూడిన బాక్స్‌లను కొనితెచ్చి ఉద్యానపంట క్షేత్రాల వద్ద అమరుస్తూ ఉపాధి పొందుతున్నారు. ఓవైపు జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతూనే మరో వైపు ఉపాధి పొందుతున్నారు. అలాగే తేనెటీగలతో పరాగ సంపర్కానికి తోడ్పడుతూ పంటలకు ప్రాణం పోస్తూ సాటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

తేనెటీగలను పెంచుతారిలా..

తేనెటీగలను బాక్స్‌ల్లో పెంచుతారు. ఒక్కో బాక్స్‌లో మైనం షీట్స్ కలిగిన 8-10 ఫ్రేమ్‌లు ఉంటాయి. వాటిల్లోనే తేనెటీగలుంటాయి. అవి బయటకు వెళ్లేందుకు, తిరిగి బాక్స్‌లోకి రావడానికి బాక్సులో ఒకేదారి ఉంటుంది. బాక్స్ మూత తీసినా తేనెటీగలు లేచి పోవు. మొత్తంగా ఒక బాక్స్‌లో 50వేల నుంచి నుంచి లక్ష తేనెటీగలు పడుతాయి. ఇందులో ఒక రాణి(పరిపూర్ణమైన ఆడ ఈగ. దీన్ని క్వీన్ బీ అంటారు). వేలల్లో కూలీ ఈగలు(అసంపూర్ణ ఆడ ఈగలు), వందలాదిగా మగ ఈగ(వీటిని డ్రోన్స్ అంటారు)లు ఉంటాయి. ఇవి రాణి ఈగ డైరెక్షన్‌లో పనిచేస్తాయి. మరికొన్ని ఈగలు పూలు, పూతపై ఉండే ఎంజైమ్స్‌ని, పుప్పొడిని, మరికొన్ని మకరందాన్ని, బంకపై ఉండే మైనాన్ని తెచ్చి జమ చేస్తాయి. మరికొన్ని ఈగలు రాణి ఈగ కోసం రాజాహారం(రాయల్ జెల్లీ)ని తెస్తాయి. ఇక బాక్స్‌లో ఉండే ఈగలు మైనంతో గదులను చక్కగా నిర్మిస్తుంటాయి. ఇక మకరందాన్ని తెచ్చిన తీగలు దానిని తేనేగా మార్చి గదుల్లో నింపి సీల్ వేస్తాయి. ఇక బాక్స్‌లో చనిపోయిన ఈగల కళేబరాలను మరికొన్ని ఈగలు బయట పడేస్తుంటాయి. బాక్స్ ప్రధాన ద్వారం నుంచి లోపలికి కొండ ఈగలు, దోమలు, ఈగలు, బల్లులు రాకుండా 15-20 తేనెటీగలు కాపలా కాస్తుంటాయి.

తేనెటీగల పెంపకంపై మక్కువ

తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుంది, ఉద్యానపంటలైన నువ్వులు, ఆవాలు, కుసుమ, కంది పంట చేలల్లో తేనెటీగల పెట్టెలను అమర్చి లాభాలు పొందొచ్చు. ఏడాది పొడవునా వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా వీటిని పెంచొచ్చు. తద్వారా వినియోగదారులకు స్థానికంగా తక్కువ ధరకు స్వచ్ఛమైన, నాణ్యమైన తేనె దొరుకుంది. తేనెటీగలు అంతరించిపోకుండా పర్యావరణాన్నీ పరిరక్షించుకోవచ్చు. తేనెటీగలు పుప్పొడితో పరపరాగ సంపర్కం చేస్తూ పండ్ల తోటలు, కూరగాయల సాగులో రైతులకు అధిక దిగుబడి సాధించేందుకు దోహదపడతాయి. పొలాల్లో తేనెటీగలతో పరాగ సంపర్కం జరిగి సాధారణంగా వచ్చే దిగుబడికన్నా 40శాతం వరకు అధిక ఎక్కువ దిగుబడి సాధ్యం అవుతుంది. దీన్ని గ్రహించిన పలువురు రైతులు తేనెటీగల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు.




తేనెపట్టును పరిశీలిస్తున్న రైతులు


తేనె బాటిళ్లు

రూ.30వేల పెట్టుబడితో ప్రారంభం

హైదరాబాద్‌కు చెందిన వాకనాగ కోటేశ్వరరావు రూ.30వేల పెట్టుబడితో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించారు. వికారాబాద్ జిల్లా మన్నెగూడ పరిధి మీర్జాపూర్ వద్ద రెండేళ్ల క్రితం 14బాక్స్‌లతో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించిన ఆయన ఇప్పుడు ఏకంగా 300 బాక్స్‌ల వరకు విస్తరింపచేశారు. మన్నెగూడతో పాటు కొడంగల్, నిజాంపేట్, సిద్దిపేట, అరకలో తేనెటీగల పెంపకాన్ని చేపడుతున్నారు. మొత్తం 2,500 బాక్సుల్లో తేనెటీగలను పెంచుతున్నారు. మన్నెగూడ వద్ద మోహన్ హనీ పేరుతో షాపును ఏర్పాటు చేశారు. రెండెకరాల్లో మామిడి, సన్‌ఫ్లవర్ తోట సాగుచేశారు. దీని పక్కనే తేనెటీగల పెట్టెలు అమర్చారు. ఒక్కో బాక్స్‌లో 8 ట్రేలున్నాయి. ఒక్కో బాక్స్ నుంచి 2 నుంచి 5కిలోల వరకు తేనె లభిస్తుందని పెంపకందారులు చెబుతున్నారు. ఇక్కడ ముగ్గురు రైతులు ఉపాధి పొందుతున్నారు. వేప, పొద్దుతిరుగుడు రకం తేనె విక్రయిస్తున్నారు. కిలో తేనె రూ.700-800 వరకు అమ్ముతున్నారు. నెలకు రూ.4లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. అన్ని ఖర్చులు పోను రూ.2లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు.

ఉద్యోగం వీడి..

సూర్యాపేట జిల్లా, మద్దిరికుంటకు చెందిన జూకూడి అనూష భర్త సుమన్‌తో కలిసి తేనెటీగల పెంపకాన్ని నేర్చుకున్నారు. ఆమె పూర్తిగా తేనెటీగల పెంపకానికి పరిమితమైపోతే, భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే తేనెటీగల పెంపకంలో భార్యకు సహకరిస్తున్నారు. ప్రస్తుతం ఈ దంపతులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తేనెటీగల పెంపకంపై రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీలో పది రోజులు శిక్షణ తీసుకొన్నారు. 'బీ' ఫ్రెష్' బ్రాండ్ పేరుతో తేనె ఉత్పత్తిని ప్రారంభించారు. ఏడాది పూర్తి కాకముందే హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ నగరాలకు తేనెను సరఫరా చేస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతున్నారు. ఆధునిక సాగు విధానాలతో తోటి రైతులకు వారు ఆదర్శంగా నిలుస్తున్నారు. రూ.50వేల పెట్టుబడితో యాచారం మండలం గడ్డమల్లయ్యగూడలో ఐదు బాక్సులతో తేనెటీగల పెంపకాన్ని మొదలుపెట్టారు. ఏడాది తిరిగే సరికి రూ.20లక్షలు వెచ్చించి 250బాక్సులకు తేనెటీగల పెంపకాన్ని విస్తరించారు. వికారాబాద్ జిల్లా తాండూరు, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధి గుంతపల్లి ప్రాంతంలో తేనెటీగల పెంపకం, ఉత్పత్తి చేస్తున్నారు. వానకాలం సీజన్‌లో నిజామాబాద్‌లో పొద్దు తిరుగుడు చేన్లలో, అలాగే ఆర్మూర్‌లో నువ్వుల పంట సమయంలో తేనెటీగల బాక్సులను ఏర్పాటు చేసి అక్కడే ఉత్పత్తి చేస్తున్నారు. ఆ తేనెను ఎల్బీనగర్‌లోని ప్యాకింగ్ పాయింట్‌కు తరలించి 'బీ ఫ్రెష్' బ్రాండ్ పేరిట అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ ఉత్పత్తులు అమెజాన్ సంస్థతో పాటు బీఫ్రెష్.కామ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.


- తేనెపట్టును పరిశీలిస్తున్న అనూష,సుమన్ దంపతులు

స్వచ్ఛమైన తేనె అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది



2014లో నేను ఆస్ట్రేలియా వెళ్లినప్పుడు, 2016లో అమెరికా వెళ్లినప్పుడూ అక్కడ స్వచ్ఛమైన తేనె రుచి చూశాను. ఇలా మన ప్రాంతంలోనూ స్వచ్ఛమైన తేనె ప్రజలకు అందుబాటులోకి తేవాలనే సంకల్పం కలిగింది. 2019లో ఇండియాకు తిరిగొచ్చిన నేను.. సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ఉద్యోగానికి స్వస్తి చెప్పి తేనెటీగల పెంపకంలోకి అడుగుపెట్టాను. తొలుత చాలా ఇబ్బందులు పడ్డాను. కానీ వెనకడుగు వేయలేదు. కుటుంబం నుంచి ప్రోత్సాహం లభించింది. మా వృత్తిని అభివృద్ధి చేస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పించాం. తేనెటీగల పెంపకంపై ఆసక్తి ఉన్నవారికి శిక్షణ కూడా ఇస్తాం. ప్రతీది కల్తీ అవుతున్న ఈ రోజుల్లో ప్రజలకు స్వచ్ఛమైన తేనెను అందిస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది.

- జోకూడి అనూష

అదనపు ఆదాయం వస్తుంది



ప్రజల్లో తేనె వినియోగం పెరిగింది. మన వద్ద డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగడం లేదు. షాపుల్లో వినియోగదారులకు నకిలీ బ్రాండ్ల తేనె అంటగడుతున్నారు. అందుకే నేను తేనెటీగల పెంపకాన్ని ఎంచుకున్నా. తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించొచ్చు. ప్రభుత్వం కూడా తేనె ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. రైతులు కూడా తమ పొలాల్లో బాక్స్‌లు ఏర్పాటు చేసుకుంటే అదనపు ఆదాయం పొందొచ్చు. తేనె టీగలతో పరాగ సంపర్కం కలిగి గింజ గట్టిపడి ఫలసాయం వృద్ధితో పంట దిగుబడి పెరిగే అవకాశముంది. మన్నెగూడ, నిజాంపేట్, కొడంగల్, సిద్దిపేట ప్రాంతాల్లో తేనెటీగల పెంపకాన్ని కొనసాగిస్తున్నా. నేను మన్నెగూడ వద్ద మోహన్ హనీ కేంద్రాన్ని ఏర్పాటు చేశాను. అక్కడ మొదట్లో 14 బాక్సులతో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభిచాను. ప్రస్తుతం 150 బాక్స్‌లకు చేరుకుంది. నాకు నెలకు అన్ని ఖర్చులు పోను రూ.2లక్షల వరకు ఆదాయం వస్తోంది.

- వాకనాగ కోటేశ్వరరావు

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 23 : గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులందరూ చర్యలు చేపట్టాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఘనంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 9గంటలకు పతావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రోటోకాల్ ప్రకారంగా అందరిని ఆహ్వానించాలని, ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్టాల్స్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు.


తల్లిదండ్రులకు పిల్లలను అప్పగిస్తున్న కలెక్టర్

పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలి

దత్తత తీసుకున్న పిల్లల పాలన బాగా చూసుకోవాలని, వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశుగృహా ద్వారా నిర్వహించిన దత్తత కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ చేతులు మీదుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దంపతులకు పిల్లలను అప్పగించారు. పిల్లలు ఇద్దరి సంపద అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని లలితా కుమారి, శిశుగృహమేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్ తపాలశాఖ అధికారి నర్సింహులు సస్పెన్షన్

కులకచర్ల, జనవరి 23: చౌడాపూర్ తపాల శాఖ అధికారి నర్సింహులును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆధార్, పాన్, ఏటీఎం కార్డులను ప్రజలకు పంపిణీ చేయకుండా చెత్త బండిలో పడేసిన విషయం విదితమే. తహసీల్దార్ ప్రభు ఫిర్యాదు మేరకు తపాలశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఆధార్ కార్డులు, ఉత్తరాలు పంపిణీ చేయడం లేదని, పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. మంగళవారం తపాలశాఖ పాలమూర్ తూర్పు డివిజన్ అధికారి ఎంవో జగనాథ్‌రావు చౌడాపూర్ బ్రాంచి పోస్ట్ మాస్టర్ నర్సింహులును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ బాధ్యతలను పాలమూర్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ బిచ్చయ్యకు అప్పగించారు. నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు


పరిగిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

పరిగి, జనవరి 23: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. మంగళవారం పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి, ఏవో ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి పరిగిలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరువుల కొరత ఉందని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఎరువుల అమ్మకాలను రోజువారీగా వివరాలను అందించాలని సూచించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు కచ్చితంగా ఎరువులు, విత్తనాలకు అమ్మకాలకు సంబంధించి రశీదులు ఇవ్వాలని సూచించారు. దుకాణాల్లో ధరల పట్టికను కచ్చితంగా ఉంచాలని, లేనిచో లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. ఆగ్రోస్ కేంద్రాలను తహసీల్దార్లు తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్‌చే ఆదేశాలు ఇప్పించామని తెలిపారు.

ఊరడమ్మకు బోనం

- పర్వతాపూర్, నారాయణపూర్‌లలో ఘనంగా బోనాల జాతర

తాండూరు రూరల్, జనవరి 23 : మండల పరిధిలోని పర్వతాపూర్, నారాయణపూర్ గ్రామాల్లో మంగళవారం గ్రామదేవత ఊరడమ్మకు బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు.. నడుమ సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పులసాని భవిష్యవాణిని వినిపించింది. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.


పర్వతాపూర్‌లో బోనాలతో ఉరేగింపుగా వెళ్తున్న మహిళలు

అక్రమాల్లో నంబర్‌వన్ మేడ్చల్!

ఫిర్యాదులతో అధికారుల జేబుల్లోకి డబ్బులు ● ఇష్టానుసారం పన్నుల వసూళ్లు

- మేడ్చల్ జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత
- జిల్లా అభివృద్ధికి సహకరించాలి : జడ్పీ చైర్మన్, కలెక్టర్


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జనవరి 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అక్రమ కట్టడాలు, అక్రమ వెంచర్లలో మేడ్చల్ నంబర్ వన్‌గా నిలుస్తున్నదని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో సైతం అక్రమ కట్టడాలు చేపడుతున్నారని అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని, ఫిర్యాదులు చేస్తే ఫిర్యాదులను సాకుగా చూపుతూ అధికారులు తమ జేబులు నింపుకుంటున్నారని సభ్యులు జిల్లా పంచాయతీ అధికారిపై మండిపడ్డారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలువురు సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. ఘట్‌కేసర్ మండలంలో ఇష్టానుసారంగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా డీపీవో పట్టించుకోవడం లేదన్నారు. ఎదులాబాద్ జీపీలో వెలుగుచూసిన అవినీతి భాగోతంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి డీపీవోను నిలదీశారు. పన్నులు వసూళ్లలో అధికారులు ప్రభుత్వానికి ఆదాయం చేకూరేలా చూడాలని, జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. శామీర్‌పేటలో ఓ గోదాంకు 28 లక్షల ట్యాక్స్ వేసి కేవలం 4 లక్షలు మాత్రమే వసూలు చేశారని, లియోనియోరిసార్ట్ వారు ప్రతిఏడాది రూ.16 లక్షల పన్నులు చెల్లిస్తుండగా ఈ ఏడాది తగ్గించి 13 లక్షలు ఎలా వసూలు చేశారని ఎంపీపీ ఎల్లుభాయి ప్రశ్నించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలని, శామీర్‌పేటలో పీహెచ్‌సీ బాధితులు రావాలంటే ఇబ్బందులకు గురౌతున్నారని ఎంపీపీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

'ఆంధ్రజ్యోతి'లో ఔటర్ కథనాలపై ప్రశ్నించిన ఘట్‌కేసర్ ఎంపీపీ

ఔటర్ రింగు రోడ్డు సర్వీసు రోడ్డులో వెలిసిన అక్రమ కట్టడాలు, రింగురోడ్డు భూముల అవకతవకలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనాలపై సమావేశంలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆంధ్రజ్యోతి కథనాలను కలెక్టర్ చూపించి వీటిపై వెంటనే విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.

రైతుబంధుపై వాగ్వాదం

పరినాట్లు పూర్తయినప్పటికీ ప్రభుత్వం ఇంత వరకు రైతు బంధు విడుదల చేయడం లేదని ఎప్పుడు రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తారని, గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగా ఇస్తారా లేక ఎన్నికల హామి మేరకు రైతుబంధు డబ్బులు ఇస్తారా అని ప్రశ్నించిన వైస్ చైర్మన్‌కు మూడుచింతలపల్లి జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డిల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. డబుల్‌బెడ్ రూమ్‌లను స్థానికులకు కేటాయించలేదని, కేటాయింపులో కూడా అవినీతి చోటు చేసుకుందని దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సమావేశంలో సభ్యులు కోరారు. సమావేశంలో పలు అంశాలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు.

అభివృద్ధికి సహకరించాలి : జిల్లా పరిషత్ చైర్మన్, కలెక్టర్

మేడ్చల్ జిల్లా అభివృద్ధి కోసం అధికారులందరూ సహకరించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకుసాగాలని జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమ్‌లు కోరారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. డబుల్ బెడ్‌రూమ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు, పన్నుల వసూళ్లపై సమీక్షలు నిర్వహించి చర్యలు చేపడుతామన్నారు. జడ్పీ సమావేశానికి మొదటిసారి హాజరైన కలెక్టర్ గౌతమ్‌ను సభ్యులు సత్కరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.


వైస్ చైర్మన్, జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం

విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం

కీసర రూరల్, జనవరి 23: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వడం అభినందనీయమని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రీన్ సోల్, ముంబై కంపనీ సహకారంతో విశ్వాసీ సాంగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు చెప్పులు (స్లిప్పర్స్), సిట్టింగ్ మ్యాట్లను పంపిణీ చేశారు. విశ్వాసి సాంగతి స్వచ్ఛంద సంస్థ జాతీయ కార్యదర్శి మాట్లాడుతూ.. పేదవిద్యార్థులకు సహకారంగా చెప్పులు, మ్యాట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నాగారం మున్సిపాలిటీలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లోని 2,365మంది విద్యార్థులకు ఈ వస్తువులను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, వైస్‌ఛైర్మన్ మల్లేష్‌యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశం పాల్గొన్నారు.

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 23: తెలంగాణ రెవన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాస్ రావు, కలెక్టరేట్ ఏవో అమరేందర్‌లతో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, రెవెన్యూ శాఖ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

తగ్గిన కందిపప్పు ధరలు

● కేజి రూ.180 నుండి రూ.150కి తగ్గింపు

తాండూరు : జనవరి 23: రుచికి శుచికి మారుపేరైనా తాండూరు కందిపప్పు ధరలు తగ్గుముఖం పట్టాయి. నెల రోజుల కిందట కిలో రూ.180 ఉండగా ప్రస్తుతం కిలో రూ.150కి చేరింది. కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన కందుల కోతలు వచ్చే నెలలో జరగనున్నాయి. ఈ కందులు మార్కెట్‌లోకి క్రయ, విక్రయాలు జరిగి కంది పప్పు ధర మరింత తగ్గే అవకాశముందికంది పప్పుకు భౌగోళిక గుర్తింపు కారణంగా ఈ పప్పుకు డిమాండ్ ఉంది.



తాండూరు కందిపప్పు

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

» రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక


ఎస్టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, జనవరి 23: పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రూపొందించిన జిల్లా డైరీని ఆయన ఆవిష్కరించారు. గత ఫలితాలకన్నా ఈ సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు రాబట్టాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో తన దృష్టికి వచ్చిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో గర్భిణీలు, బాలింతలు, దివ్యాంగులకు మినహాయింపునివ్వాలని ఎస్టీయూ నాయకులు కలెక్టర్‌ను కోరారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున అల్పాహారం ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు స్వచ్ఛ కార్మికులను నియమించాలని కలెక్టర్‌ను కోరారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి, నాయకులు పరమేష్, బాలకృష్ణలున్నారు.


సీతారాముల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తాండూరులో సీతారాముల ఊరేగింపు

తాండూరు, జనవరి 23: అయోధ్య రామ మందిర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా తాండూరులో గోశాల సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం రెండోరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగాయి. స్టేషన్ హనుమాన్ ఆలయం నుంచి పట్టణ వీధుల గుండా సీతారాముల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచారకులు చికోటి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. శ్రీరామ కీర్తనలతో ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది.

సమస్యల పరిష్కారంతోనే

ప్రజాప్రతినిధులకు గుర్తింపు


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్ శరత్ చంద్రారెడ్డి

మేడ్చల్ టౌన్, జనవరి 23: ప్రజా సమస్యల పరిష్కారంతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గౌడవెల్లి గ్రామంలో మంగళవారం పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాన్ని, పోస్టాఫీస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ వారు పలు అభివృద్ధి పనులు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, పంచాయతీ మొదటి అంతస్తు భవనం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించి పనులు చేపట్టడం పట్ల సర్పంచ్‌ను అభినందించారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గౌడవెల్లి గ్రామాభివృద్ధికి స్థానిక పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, ఉపసర్పంచ్ పెంటమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రైల్వే అండర్ బై పాస్ బ్రిడ్జి పనుల పరిశీలన

మేడ్చల్ టౌన్, జనవరి 23: మేడ్చల్ పట్టణంలో నిలిచిన రైల్వేఅండర్ బై పాస్ బ్రిడ్జి పనులను జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. గత నాలుగు సంవత్సరాల కిందట ప్రారంభించిన బ్రిడ్జి పూర్తి కాకపోవటంతో మేడ్చల్ పట్టణ వాసులతో పాటు, మండలంలోని 7 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు జడ్పీచైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వే శాఖ అధికారులు, కాంట్రాక్టరు, నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొందని స్థానికులు వివరించారు. చైర్మన్ స్పందిస్తూ.. అండర్ బై పాస్ బ్రిడ్జి పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైల్వేశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నందున పనుల్లో జాప్యం సహజమని, పట్టించుకునే వారుంటే పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జడ్పీకి ప్రత్యేక నిధులివ్వండి

» స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు జడ్పీ చైర్‌పర్సన్ వినతి


స్పీకర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 23: జిల్లా పరిషత్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు ఇప్పించాలని జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్ రెడ్డి స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్ నివాసంలో మంగళవారం సునీతారెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో జిల్లా అభివృద్ధిపై ఇద్దరి నేతలు చర్చించారు. అదేవిధంగా జిల్లా పరిషత్ భవన నిర్మాణానికి అదనపు నిధులు ఇవ్వాలని కోరారు. సీఎం జిల్లా కాబట్టి అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. దీనికి స్పీకర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా అభివృద్ధికి సీఎంను కలిసి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మోమిన్‌పేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరోత్తంరెడ్డి ఉన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ

విధులు నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 23: పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం మొబిలైజేషన్ శిక్షణ ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15రోజుల పాటు పోలీస్ అధికారులకు ప్రాథమిక శిక్షణ పరేడ్, ఫైరింగ్, లాఠీ డ్రిల్, మబ్ ఆపరేషన్ డ్రిల్, ఇండోర్ తరగతులు మొదలగు అంశాల పట్ల మళ్లీ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతలో అత్యుత్తమ పాత్ర పోషించాలన్నారు. మంచి సమాజ స్థాపనలోఓ పోలీసు కుటుంబాల పాత్ర ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఏవో జోతిర్మని, ఆర్‌ఐలు సూరపు నాయుడు, అంజాత్ పాషా, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, ఆర్‌ఎస్‌ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాల విషయమై డీఎల్‌పీవో విచారణ


పంచాయతీలో తీర్మానాల విషయమై కార్యదర్శిని ప్రశ్నిస్తున్న డీఎల్‌పీవో

తాండూరు రూరల్, జనవరి 23: గ్రామపంచాయతీల్లో ప్రతి నెలా పాలకవర్గం సభ్యులు సమావేశం నిర్వహించుకోవాలని తాండూరు డీఎల్‌పీవో శంకర్‌నాయక్ పాలకవర్గాన్ని ఆదేశించారు. తాండూరు మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీలో మంగళవారం సమావేశాలు నిర్వహించకపోవడం గ్రామాభివృద్ధికి తీర్మానాలు ఇవ్వడం లేదని కొంతమంది వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో శంకర్‌నాయక్, మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్‌తో కలిసి సమీక్షించారు. ప్రతినెలా గ్రామపంచాయతీలో సమావేశాలు నిర్వహించి పాలకవర్గం సభ్యులంతా కలిసి అభివృద్ధి పనులపై తీర్మానాలు చేయాల్సి ఉండగా, ఇవేమీ చేయడం లేదని తమ విచారణలో తేలిందన్నారు. ఈ విషయంపై ఎందుకు సమావేశాలు నిర్వహించడం లేదు? సర్పంచ్, వార్డు సభ్యులు ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా? అని పంచాయతీ కార్యదర్శి భవానీని ప్రశ్నించారు. గత సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలలో సమావేశాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఎందుకు నిర్వహించలేదని ఆమెపై అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి 12న సమావేశం నిర్వహించినప్పటికీ సర్పంచ్ నందిని, ఉపసర్పంచ్ చెన్నప్ప, వార్డు సభ్యుల సంతకాలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్‌ను కూడా మీరెందుకు పర్యవేక్షించడం లేదని, అలాంటప్పుడు మీపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వార్డు సభ్యులకు సమావేశం ఉందని నోటీసు ఇచ్చి రాకుంటే మూడు నెలల తర్వాత వారిని పదవి నుంచి తొలగించాల్సి వస్తుందని పేర్కొన్నారు. మహిళా వార్డు సభ్యులైతే ఆరు నెలలు సమావేశానికి రాకుంటే వారిని పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తొలగిస్తామన్నారు. అనంతరం గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించగా, రూ.18లక్షల 700, 70లు ఉన్నట్లు గుర్తించారు. వార్డు సభ్యులు శామప్ప, సునిత, యశోధ, తిరుపతిగౌడ్‌లతో తీర్మానంపై సమీక్షించారు. 2022లో రూ.8లక్షలకు సంబంధించి తీర్మానం చేసినప్పటికీ పనులు చేయలేకపోయారని, వార్డు సభ్యుడు శామప్ప డీఎల్‌పీవో ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రికార్డుల్లో తమ సంతకాలు కూడా సక్రమంగా లేవని, కొన్ని సంతకాలు వారే చేసుకున్నారని డీఎల్‌పీవో ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వారి సంతకాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు.

మాజీ మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్యలు సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 23: బీజేపీ అంక్షితలు పంచడం తప్పు చేసిందేమీ లేదంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు నాలుగున్నరేళ్లు మంత్రిగా పని చేసిన మల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఒక్కరూపాయి అయినా తీసుకువచ్చావా? అని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలకోట్ల నిదులు మంజూరు చేసిందని అన్నారు. కేంద్ర నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. కొడుకు ఎంపీ టికెట్టు కోసం మల్లారెడ్డి దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. మల్లారెడ్డి దేవుడని పొగిడిన వారంతా పదవులు కోల్పోయి మాజీలు అయ్యారని, ఆయనది ఐరన్‌లేగ్ అని ఎద్దేవా చేశారు. ఏపార్టీలో చేరినా ఆపార్టీ అధికారం కోల్పోడం తప్పదన్నారు. ఆయన ప్రజాసేవను మరిచి రాజకీయంను వ్యాపారం చేశాడని ఆరోపించారు. ప్రధానంగా ఎన్నికల్లో భారీగా డబ్బులు, మద్యం పంపిణీ చేసి గెలుపొందడమే ఆయన లక్ష్యమని అన్నారు. కండ్లకోయలో కేటీఆర్ శంకుస్థాపన చేసిన ఐటీహబ్ ఏమైందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, గృహలక్ష్మి పథకాలు ఇస్తామని చెప్పి ప్రజలను మోసగించారని వాపోయారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, శివ, నరేష్, కృష్ణ, సత్యానారాయణరెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు కార్మికులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, జనవరి 23 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మధ్యాహ్న భోజన కార్మిక సంఘ నేతలతో కలిసి ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగు నెలల బిల్లులు, వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి పూర్తి అయిందన్నారు. కాని మధ్యాహ్న భక్షజన కార్మికులకు మాత్రం ఐదు నెలలుగా బిల్లులు, వేతనాలు మంజూరు చేయడం లేదన్నారు. అలాగే మార్కెట్‌లో కోడి గుడ్డు ధర పెరిగి కార్మికులకు రూ.2వేల నుండి 3వేల వరకు నెలకు అదనంగా భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి శ్రీనివాస్, జి.కిషన్‌జీ, అశ్విని, శైలజ, అండాలు, రజని, కళమ్మ పాల్గొన్నారు.


షీల్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


క్రీడల్లో గెలుపోటములు సహజం

కొందుర్గు, జనవరి 23: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 10న మొదలైన కొందుర్గు ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. టోర్నమెంట్‌లో మొత్తం 8 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ముంబాయి ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడగా, ముంబాయి టీం విజేతగా నిలిచింది. విజేతకు రూ.30వేల నగదును, షీల్డ్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన ఢిల్లీ జట్టుకు రూ.20వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందుర్గు మండల కేంద్రంలో ప్రతీ సంవత్సరం వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ టోర్నమెంట్ల నిర్వహణతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, బి.నరేందర్, రవీందర్‌రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, ఎండీ షబ్బీర్, రశీద్, షకూర్, కె.శ్రీశైలం, సత్యనారాయణ, శ్రీనివాస్, చిన్నరాజు, చంద్రశేఖర్, కె.ప్రవీణ్, సచిన్, జీబీ కృష్ణ, నర్సింలు, డి.రాంచంద్రయ్య, రెడ్డి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


మాల్‌లో రైతులకు ఫిర్యాదు చేసేందుకు పేపర్ కాపీలను అందజేస్తున్న నిర్వాహకులు

ధరణి పోర్టల్‌తో తీరని అన్యాయం

యాచారం, జనవరి 23 : ధరణి పోర్టల్ కారణంగా రైతులకు అనేక కష్టాలతో పాటు తీరని అ న్యాయం జరుగుతోందని వైస్ ఎంపీపీ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నా రు. మంగళవారం మండలంలోని మాల్, తాటిపర్తి గ్రామాల్లో లీఫ్స్ సంస్థ బృందం భూన్యాయ శిబిరం నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ భూములు కొనుగోలు చేసి పదేళ్లు గడుస్తున్నా రైతు బంధు, రైతు బీమా ఆర్థిక సాయం అందలేదని బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకుల రైతు బంధు, రైతు బీమాపై అవాక్కులు, చెవాక్కులు విడ్డూరంగా ఉందన్నారు. లీఫ్స్ సంస్థ భూ న్యాయ శిబిరాలను గ్రామ గ్రామాన ఏర్పాటు చేసి రైతుల సమస్యలు తెలుసుకోవడం అభినందనీయమన్నారు. సర్పంచులు పి.కవిత, డి.రమేష్, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై వెంకటనారాయణ

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

యాచారం, జనవరి 23 : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సై వెంకటనారాయణ సూచించారు. మంగళవారం యాచారంలోని సెయింట్ గ్రెగోరియస్ బాలాగ్రామ్ సంస్థ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బస్టాండ్‌లో సీబీఎస్‌ఈ సిలబస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అమ్మనాన్నలు పొలం పనులు, చిరు ఉద్యోగాలు చేస్తూ మిమ్మల్ని చదివిస్తున్నారనే విషయం మర్చిపోవద్దని, ప్రతీ ఒక్కరు ఇష్టంతో చదవాలని, బట్టీపట్టే విధానం మంచిది కాదని అన్నారు. సెయింట్ గ్రెగోరియస్ బాలాగ్రామ్ సంస్థ సీబీఎస్‌ఈ సిలబస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా విద్యను వ్యాపారంగా చూడరాదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేచల్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శం


పరిగి: నేతాజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి, జనవరి 23: స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.శ్రీశైలం అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పరిగిలోని నేతాజీ విగ్రహానికి ఆయా పార్టీల నాయకులు పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మేడ్చల్ టౌన్: నేతాజీ జయంతి వేడుకలను మంగళవారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోని అత్వెల్లి వద్ద ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి బీజేపీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేడ్చల్ పట్టణ వివేకానంద చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జుస్వామి ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు నేతాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మేడ్చల్ టౌన్: నేతాజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూరు: తాండూరులో మంగళవారం నేతాజీ చౌక్‌లో నేతాజీ విగ్రహానికి జయంతి సందర్భంగా పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్, టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కౌన్సిలర్ సోమశేఖర్, సీనియర్ జర్నలిస్టు శెట్టి రవిశంకర్, వీడీఏఎయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ జిల్లా నాయకులు బంటారం భద్రేశ్వర్, యువజన విభాగం సభ్యులు విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు నేతాజీ వేషాధారణలో పలువురిని ఆకట్టుకున్నారు.

కీసర: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం కీసరలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆయన గొప్పదనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం శామీర్‌పేటలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను స్టార్, చైతన్య యువజన సంఘాల ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా కేసీఆర్ సేవాదళం నాయకుడు మహ్మద్ అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లిలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్రైం కార్నర్

పత్తిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా


ఎన్నెపల్లి చౌరస్తాలో బోల్తా పడిన పత్తి ట్రాక్టర్

వికారాబాద్, జనవరి 23: పత్తి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ధారూరు మండలం అంతారం గ్రామానికి చెందిన గాండ్ల మల్లప్ప పత్తిని అమ్మేందుకు ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని మంగళవారం తెల్లవారు జామున చిట్టంపల్లివైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చెరువుకాలువలో పడి వృద్ధుడి మృతి

పరిగి, జనవరి 23: చెరువు కాలువలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మిట్టకోడూరు గ్రామానికి చెందిన బైండ్ల ఎల్లయ్య(70) నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి బయలుదేరి కనిపించకుండా పోయాడు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని చెరువుకాలువలో స్థానికులకు మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ఎల్లయ్య మృతదేహంగా గుర్తించారు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘దళిత బంధు’ నిధులు విడుదల చేయాలి


కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా దళిత బంధు సాధన సమితి నాయకులు

కొడంగల్, జనవరి 23: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని వికారాబాద్ జిల్లా దళిత బంధు సాధన సమితి, దళిత ప్రజాసంఘాల నాయకులు కోరారు. కొడంగల్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అధికారి కె.వెంకట్‌రెడ్డికి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పాండుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ ఎరన్‌పల్లి శ్రీనివాస్, కో కన్వీనర్ దత్తు, అంబేడ్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు దస్తప్ప, ఆర్.హన్మంతు, శ్రీనివాస్, నర్సింహులు, విజయ్, శ్యామప్ప, అన్నారం అంజి, సాయిలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించే బాధ్యత నాది


సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 23: పదవీకాలం పూర్తయిన సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇప్పించే బాధ్యత తనదని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సర్పంచులకు ఐదేళ్ల పదవి కాలం జనవరి 31తో ముగిస్తున్న సందర్భంగా మంగళవారం పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు జి.అశోక్‌రెడ్డి అధ్యక్షతన పరిగి నియోజకవర్గంలోని సర్పంచులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి సర్పంచ్‌ను సన్మానించి మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్ళ నుంచి పనులు చేపట్టిన బిల్లులు రాని వాటి గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులను విడుదల చేయించి దశలవారీగా బిల్లులు ఇప్పిస్తానని తెలిపారు. గత ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులను నానా ఇబ్బందులు పెట్టిందన్నారు. కోర్టులకు వెళ్లి బిల్లులు తెప్పించుకున్నారని, తాను మాత్రం అలా చేయనని చెప్పారు. పార్టీలు వేరైనా గ్రామాల అభివృద్ధి విషయంలో భాగస్వాములై పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు కె.అరవింద్‌రావు, సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీలు బి.హరిప్రియ, ఎంపీపీ మేఘమాల, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.అశోక్‌రెడ్డి, ఎంపీడీవో శేషగిరి శర్మ, ఎంపీవో దయానంద్ పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

కీసర జనవరి 23: కీసర పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కీసర గ్రామం మొత్తం నేడు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా 11కేవీ పెద్దమ్మ చెరువు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

బొంరాస్‌పేట్ ఎస్ఐగా అబ్దుల్ రవూఫ్


బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ అబ్దుల్ రవూఫ్

బొంరాస్‌పేట్/తాండూరు, జనవరి 23: బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా అబ్దుల్ రవూఫ్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ రవూఫ్ బదిలీల్లో భాగంగా బొంరాస్‌పేట్‌కు రాగా, బొంరాస్‌పేట్‌లో ఎస్ఐ విధులు నిర్వహిస్తున్న శంకర్ తాండూర్‌కు బదిలీ అయ్యారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, జనవరి 23: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు ఇవ్వలేదని ధర్నా


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ భరత్‌రెడ్డి

కొడంగల్, జనవరి 23: కొడంగల్ పట్టణంలో వరి కొనుగోలు చేసిన ఓ దళారి వ్యాపారి డబ్బులు ఇవ్వకుండా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నాడని బాధిత రైతులు ఆందోళన చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్సై భరత్‌రెడ్డి అక్కడికి చేరుకొని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

అభివృద్ధి పనుల బాధ్యత కార్యకర్తలదే


ముజాహిద్‌పూర్‌లో పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, జనవరి 23: అభివృద్ధి పనుల ఎంపిక నుంచి ఆ పనులు పూర్తయ్యే వరకు కార్యకర్తలదే బాధ్యత అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌లో నూతన పంచాయతీ భవనాన్ని ఆయన మంగళవారం పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో ఉపాధిహామీ, సీడీపీ నిధులు రూ.17లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ లక్ష్మీఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులకచర్ల మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల అభివృద్ధి దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గొర్రెల పంపిణీకి చెల్లించిన డీడీలు లబ్ధిదారులు తీసుకోవాలన్నారు. అవకాశం వచ్చినప్పుడు తిరిగి చెల్లించాలన్నారు. స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిచంద్ర, డీపీవో తరుణ్‌కుమార్, పీఆర్ డీఈ లక్ష్మయ్య, ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కరీం, ఎంఈవో హబీబ్ అహ్మద్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి గోపాల్ నాయక్, ఉపసర్పంచ్ చంద్రభూపాల్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, వార్డుసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి: డీఎల్‌పీవో


మాట్లాడుతున్న డీఎల్‌పీవో అనిత

ధారూరు, జనవరి 23: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని వికారాబాద్ డీఎల్‌పీవో అనిత పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండలంలోని అంతారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆమె రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఆన్‌లైన్ అప్డేషన్, పారిశుధ్య నిర్వహణ, డీఎస్ఆర్, జీపీడీపీ తదితర పనులను పూర్తి చేసేందుకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎపీవో షఫీ ఉల్లా, అంతారం సర్పంచ్ నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బషీరాబాద్: ఇంటి పన్ను వసూళ్ల సకాలంలో పూర్తికి గ్రామ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని బషీరాబాద్ ఎంపీడీవో రమేష్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాయంలో ‘ఆంధ్రజ్యోతి’తో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీల పరిధిలో ఇప్పటి వరకు 40 శాతం ఇంటి పన్ను వసూళ్ల చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఇంటి పన్ను విధిగా చెల్లించి గ్రామాభివృద్ధికి సహకారించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నాటికి వంద శాతం పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి


అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

వికారాబాద్, జనవరి 23: మునిసిపల్ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. మహిపాల్, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, యూనియన్ అధ్యక్షులు కిష్టయ్య కార్యదర్శి శంకర్ మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిగి మున్సిపాలిటీలో 30 మందికి, వికారాబాద్‌లో 15మందికి ఏడాది పెండింగ్ జీతాలు ఇవ్వాలన్నారు. యూనిఫామ్స్ సబ్బులు, నూనెలు బూట్లు ఇవ్వాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు లక్ష్మయ్య, శంకర్, వెంకటప్ప, జంగమ్మ, లక్ష్మీ సత్యమ్మ పాల్గొన్నారు.

అన్నివిధాలుగా గ్రామాభివృద్ధి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 23: గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రతాప్‌సింగారం సర్పంచ్ వంగూరి శివశంకర్ అన్నారు. మండలంలోని ప్రతాప్‌సింగారం పంచాయతీ సమావేశం మంగళవారం సర్పంచ్ వంగూరి శివశంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముందుగా పంచాయతీకి సంబంధించిన ఆదాయ వ్యయాలపై చర్చించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు పంచాయతీ అభివృద్ధిలో సహకరించిన పాలకవర్గసభ్యులకు, గ్రామస్తులకు సర్పంచ్ ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబేదాబేగం, కార్యదర్శి నరేష్, వార్డుసభ్యులు లలిత, భార్గవి, హంసమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్ ఎంపీవోగా మహేశ్‌కుమార్

బొంరాస్‌పేట్, జనవరి 23: బొంరాస్‌పేట్ నూతన ఎంపీవోగా మహేశ్‌కుమార్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సుశీల్‌కుమార్ మర్పల్లి మండలానికి బదిలీపై వెళ్లగా అక్కడ పని చేస్తున్న మహేశ్‌కుమార్ బొంరాస్‌పేట్ నూతన యంపీవోగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

కలిసికట్టుగా పనిచేద్దాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

మోమిన్‌పేట్, జనవరి 23: పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేద్దామని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండలంలోని గోవిందాపూర్, ఎన్కెపల్లి గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేకు ఎంపీ అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎన్కెపల్లి గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. గోవిందాపూర్‌లో అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు ఆశమ్మ, అనంతమ్మ, నాయకులు అనూపరెడ్డి, జైపాల్‌రెడ్డి, మల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ఉత్తమ పారిశుధ్య కార్మికురాలిగా ఎంపిక


లక్ష్మి

కొడంగల్, జనవరి 23: వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీ కార్మికురాలు లక్ష్మి ఉత్తమ పారిశుధ్య కార్మికురాలిగా ఎంపికైంది. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేయడం, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో తెలంగాణ రాష్ట్రంలో నలుగురిని కేంద్ర ప్రభుత్వం ఉత్తమ కార్మికులుగా ఎంపిక చేసింది. అందులో హస్నాబాద్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికురాలు లక్ష్మి ఎంపికైంది. ఈనెల 26వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకోనుంది.

ఉద్యోగాల కల్పనకే మెగా జాబ్‌మేళా

పరిగి, జనవరి 23: యువతకు ఉద్యోగాల కల్పించేందుకే మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్‌నెం.01 పాఠశాలలో 50కంపెనీలతో, 6500మందికి ఉద్యోగాలు కల్పించేందుకు మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తెలంగాణను సాధించుకున్న నిధులు, నీళ్లు, నియమాకాల కోసం అయితే, పదేళ్లుగా ఈ మూడింటిని విస్మరించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని ఇలా నిరంతరంగా జాబ్ మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి దాని ప్రకారమే ఉద్యోగులకు నోటిఫికేషన్‌లు వేసి నియమాకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధికల్పన శాఖ ప్రాంతీయ అధికారి భవాని జిల్లా అధికారి షేక్‌అబ్దుస్‌సుభాన్, మియసాబ్ పాల్గొన్నారు. జాబ్ మేళాకు పరిగి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వేలాది మంది నిరుద్యోగులు తరలివచ్చారు. ఎంపికైన వారిని ఆయా కంపెనీల నుంచి ఉద్యోగ నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.

మాజీ ఎంపీకి సన్మానం


మల్లు రవిని కలిసిన డీసీసీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు

పరిగి, జనవరి 23: మాజీ ఎంపీ, ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన డాక్టర్ మల్లు రవిని మంగళవారం పరిగికి చెందిన డీసీసీ ప్రధానకార్యదర్శి ఎస్.రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజలింగం తదితరుల బృందం కలిశారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలను నామిటేడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు రామకృష్ణ తెలిపారు.

పాఠశాలకు బెంచీలు వితరణ


బెంచీలను చూపిస్తున్న ఎంఈవో హరిచందర్

దోమ, జనవరి 23: బొంపల్లి ఉన్నత పాఠశాలలో మోడీ బిల్డర్స్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 106 డ్యూయల్ డెస్క్ బెంచీలు, 10 గ్రీన్ బోర్డులు, 16 టేబుల్స్‌ను అందజేశారు. బొంపల్లి పాఠశాల పరిధిలోని బాసుపల్లి, గోడుగోనిపల్లి, దోర్నాలపల్లి, మైలారం, కేశలమ్మ తండా, గోన్యానాయక్ తండా, జహంగీర్‌సాబ్ తండా, రత్నానాయక్ తండా, గూడురు, దొంగెన్కెపల్లి పాఠశాలల్లో వితరణ చేశారు. ఎంఈవో హరిచందర్ మంగళవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంకు బెంచీలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటేశ్, షఫీ, సర్పంచ్ కే.సురేశ్, ఎంపీటీసీ ఆర్.రాములు, ఎస్ఎంసీ చైర్మన్ అనంతయ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు 150మంది ఎంపిక


కరాటే పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

పూడూరు, జనవరి 23: ట్రెడిషనల్ జపాన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన సరూర్‌నగర్‌లో అంతర్జాతీయ నకయమ షోటోకాన్ పోటీలకు జిల్లా నుంచి 150మంది ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి పోస్టర్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు క్రమ శిక్షణ, ఆత్మ రక్షణకు, ఆరోగ్యానికి కరాటే తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు జె.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులను వినియోగించుకోవాలి

వికారాబాద్, జనవరి 23: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గ్రామాల్లో ఉపయోగించుకోవాలని ఎంపీపీ చంద్రకళ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం సమావేశం నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి, 2023 మార్చి వరకు జరిపిన పనులను ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో స్టివెన్‌నెల్లి, ఎంపీడీవో సత్తయ్య, ఎస్ఆర్‌పీ రజిత పాల్గొన్నారు.

గట్టుమైసమ్మ జాతరను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్. జనవరి 23: ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఈనెల 28న జరిగే ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగుచర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం గట్టుమైసమ్మ ఆలయాన్ని పరిశీలించి బందోబస్తుపై చర్చించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, ఈవో భాగ్యలక్ష్మి, కమిషనర్ ఎండీ సాబేర్‌అలీ, వైస్‌చైర్మన్ పల్లుల మాదవరెడ్డి, ఎస్ఐ శేఖర్, ట్రాఫిక్ పోలీసులు, కౌన్సిలర్ అంజనేయులు గౌడ్ చర్చించారు.

ఓటరు జాబితాలో మృతుల పేర్లు తొలగించాలి

మర్పల్లి, జనవరి 23: ఓటరు జాబితాలో మృతి చెందిన వారిని గుర్తించి తొలగించాలని మర్పల్లి తహసీల్దార్ గణేశ్ అన్నారు. మంగళవారం మర్పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్/బొంరాస్‌పేట్: ఓటరు జాబితాలో మృతి చెందిన వారి పేర్ల తొలగింపు, డబుల్ ఉన్న వారి పేర్లను తొలగించాలని తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్, వెంకటేశ్ అన్నారు. మంగళవారం కొడంగల్, బొంరాస్‌పేట్ తహసీల్దార్ కార్యాలయాల్లో వేర్వేరుగా బూత్ లెవల్ అధికారులు, సూపర్ వైజర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

పరామర్శ


రాంలింగారెడ్డిని పరామర్శిస్తున్న శుభప్రద్‌పటేల్

తాండూరు రూరల్, జనవరి 23: మండలంలోని జినుగుర్తి మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆయన కుటుంబీకులను పరామర్శించారు. మంగళవారం జినుగుర్తిలోని ఆయన నివాసానికి వెళ్లి ఏసిరెడ్డి కుమారుడు, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ రాంలింగారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట నర్సింహులు, భాను, శేఖర్, చందు, నరేష్ గౌడ్, విజయ్ పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

- **పూడూరు:** మండలంలోని ఆర్కిడ్ పాలిహౌస్, మామిడి తోటను కొండలక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్ బృందం నేడు(బుధవారం) సందర్శించనుంది. అదేవిధంగా వికారాబాద్‌లోని హార్టికల్చర్ ఫాంను క్షేత్రస్థాయిలో సందర్శించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.
- **నవాబుపేట:** నవాబుపేట మండలంలోని అక్నాపూర్‌లో నేడు, రేపు మైసమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ తలారి అజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవాలకు చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరు కానున్నట్లు తెలిపారు.

అన్నదానం

శామీర్‌పేట, జనవరి 23: శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్వాల్ ప్రాంతానికి చెందిన జాతవత్ పుల్యానాయక్, నీలమ్మ దంపతులు వారి కుమారలు శివకుమార్, సంజీవ్‌కుమార్‌లు అన్నదానం చేశారు.

కాణిపాకం వినాయకుడి సేవలో ఎమ్మెల్యే


ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

తాండూరు, జనవరి 23: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దంపతులు మంగళవారం చిత్తూరు జిల్లా కాణిపాకం వినాయకుని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అక్కడ పూజారులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దంపతులను వేదమంత్రాలతో సైతం పలికి ఆశీర్వచనాలు ఇచ్చారు.